

ఘనంగా మహేష్‌బాబు పుట్టినరోజు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సూపర్‌స్టార్ మహేష్‌బాబు పుట్టిన రోజును మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు సలాది కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. తొలుత కేక్‌ను కట్ చేసి మహేష్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సలాది కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహేష్‌బాబు అభిమానులు సువర్ణం విజయశేఖర్, తాతపూడి అనిల్‌కుమార్, కొల్లా అనిల్‌కుమార్, కాతేటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆహారాన్ని అందిస్తున్న నిర్వాహకులు

అంగన్‌వాడీ మినీ వర్కర్ల ఇక్కట్లు

- వేతనాల కోసం మినీ వర్కర్ల ఎదురుచూపు
-పని ఒత్తిడి మధ్య విధులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పేద, మధ్యతరగతి వర్గాల చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం కృషి చేస్తున్న అంగన్‌వాడీ వ్యవస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. అందులో మినీ వర్కర్ల బతుకులు మరింత అగమ్యగోచరంగా మారాయి. కనీస వేతనాలకు వారు నోచుకోవడం లేదు.

ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీలు సైతం కనీస వేతనాల కోసం పోరాటాలు సాగిస్తున్నారు. మినీ అంగన్‌వాడీ వర్కర్లకు మెయిన్ వర్కర్ల మాదిరిగా వేతనాలు పెంచుతూ ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 1986 మెయిన్, మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు, 11,518 మంది బాలింతలు, 13,134 మంది



గర్భిణులు ఉన్నారు. సుమారు 3,500 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పని చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు నెలకు రూ.11,500, ఆయాకు, మినీ వర్కర్‌కు రూ.7 వేలు చొప్పున వేతనంగా అందిస్తున్నారు.

ఇచ్చేది సరిపెట్టుకునేది ఎలా..?

ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇటీవల కాలంలో వీటి ధరలు 20 నుంచి 30 శాతం అదనంగా పెరిగాయి. మరోవైపు విద్యుత్తు ఛార్జీలు భారం పేద, సామాన్య వర్గాలపై ఎక్కువగా పడుతోంది. ఈ నేపథ్యంలో ఒక సామాన్య కుటుంబం బతకాలంటే కనీసంగా రూ.30 వేలు ఉంటేనే గాని సరిపోని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో మినీ అంగన్‌వాడీ వర్కర్లకు ఏ విధంగా ఈ జీతం సరిపోతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అనేక ఏళ్లుగా ఈ అరకొర వేతనంతోనే వీరంతా జీవనం సాగిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యాలను కాపాడుతున్నప్పటికీ మినీ వర్కర్లంతా ఆకలితో అలమటించే దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

ఒకరిపైనే భారం

మినీ సెంటర్లలో కేవలం ఒక్కరు మాత్రమే సేవలు అందిస్తూ ఉంటారు. ప్రజలు నివసించే ప్రతి చోటా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తెలపడంతో ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ లేని చోట మినీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. వీటిల్లో ఇద్దరు చేయాల్సిన పని ఒక్కరు మాత్రమే చేయాల్సి వస్తుంది. దీంతో మినీ అంగన్‌వాడీ వర్కర్ల బతుకులు అధ్వానంగా మారాయి. ఓ పక్క ఉద్యోగం చేసుకుంటూనే, మరో వైపు అదనపు పనులు చేస్తూ ఇచ్చే అరకొర జీతంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని, అప్పులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి 6 సంవత్సరాల వయసు వరకు ప్రతి నెల వారి బరువుని, ఎత్తుని కొలిచి ఆన్‌లైన్లో, రికార్డుల్లో నమోదు చేయాలి. ఒక్కో సెంటర్ పరిధిలో సుమారు 100 మంది పిల్లలు ఉంటున్నారు. కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ కార్యక్రమాలు, ఇతర అంశాలు ఎప్పటికప్పుడు ప్రతిరోజు సుమారు 20 వరకు ఫోటోలు తీసి ఐసిడిఎస్ అధికారులకు చేరవేయాలి. ఇవే కాకుండా కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారం తెలుసుకుంటూ ప్రతిరోజూ వారికి పౌష్టికాహారం అందించాల్సి ఉంటుంది. నాణ్యతలేని సెల్‌ఫోన్‌లను పంపిణీ చేయగా అవి పనికి రాకుండా పోవడంతో సొంత ఫోన్లతో డేటా పనులు పూర్తి చేయాల్సి వస్తుంది. ఇచ్చిన పాత ఫోన్లను ఇటీవల ఆందోళన చేసి అధికారులకు అందజేశారు.

చిన్నచూపు తగదు



అంగన్‌వాడీ వ్యవస్థ పట్ల రాష్ట్ర ప్రభుత్వ చిన్నచూపు తగదు. ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తుంటేనే ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి ఉంది. మినీ వర్కర్లకు రూ.7 వేలు వేతనం ఏ మాత్రం సరిపోవడం లేదు. మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు పెంచుతామని మంత్రివర్గం నిర్ణయించింది. కానీ నేటికీ జిఒ విడుదల చేయలేదు. తక్షణం కూటమి సర్కారు స్పందించి వేతనాల పెంపు జిఒను విడుదల చేయాలి.

-జి. బేబీరాణి, అధ్యక్షురాలు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ఎలా బతుకుతారు..?



ఐసిడిఎస్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్రాలను నడుపుతున్నాం. ప్రస్తుతం పెరుగుతున్న నిత్య అవసరాలకు ప్రభుత్వ ఇస్తున్న వేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదు. మినీ వర్కర్లకు కనీస వేతనాలు తక్షణమే పెంచాలి.

-ఇ.చంద్రావతి, జిల్లా కార్యదర్శి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



ఎంపికైన అభ్యర్థులతోపాటు, శ్యామ్ ఇన్స్టిట్యూట్ నిర్వాహకులను సత్కరిస్తున్న హోంమంత్రి అనిత

శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌కు హోంమంత్రి కితాబు

ప్రజాశక్తి - కాకినాడ

ఇటీవల విడుదలైన ఎపి పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 'శ్యామ్ ఇన్స్టిట్యూట్' యాజమాన్యానికి హోంమంత్రి వంగలపూడి అనిత అభినందనలు తెలిపారు. శనివారం ఇన్స్టిట్యూట్ ఛైర్మన్ గుంటూరి శ్యామ్, డైరెక్టర్ శైలజా, స్టేట్ టాపర్స్‌గా నిలిచిన శ్యామ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు జి.నానాజీ, జి.రమ్యమాధురి, ఎం.అచ్యుతరావు, ఎస్.భవాని విశాఖలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్ అందించి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో శ్యామ్ ఇన్స్టిట్యూట్ కీలకపాత్రను పోషించిందని హోం మంత్రి అభినందించారు. ప్రభుత్వం ప్రకటించిన 6,014 కానిస్టేబుల్ పోస్టులలో 4,673కి పైగా పోస్టులను శ్యామ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులే కైవశం చేసుకోవడం అభినందనీయమన్నారు. విశాఖ జిల్లాకు చెందిన జి.నానాజీ 168 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను, శ్రీకాకుళం జిల్లాకు చెందిన పి.అప్పలనాయుడు 167 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్‌ను, విజయనగరం జిల్లాకు చెందిన జి.రమ్యమాధురి 159 మార్కులతో మహిళా విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకను, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎస్.భవాని 154 మార్కులతో మహిళా విభాగంలో స్టేట్ సెకండ్ ర్యాంకును, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎం.అచ్యుతరావు 144.5 మార్కులతో ఎపిఎస్‌పి విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడమే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో డిస్ట్రిక్ ఫస్ట్ ర్యాంకులను సాధించినందుకు హోంమంత్రి శ్యామ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులను, శ్యామ్ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. శనివారం సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు నీటిని ఎంఎల్‌ఎ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు ద్వారా 10 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడం జరుగుతుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల పెట్టుబడికి అవసరమైన నగదును వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. రైతులకు ఏ సమస్యలు వచ్చినా పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి సాగర్ ఛైర్మన్ ఇళ్ల, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, సర్పంచ్ వనపర్తి నాగేశ్వరరావు, నాయకులు అమరాధి వెంకట్రావు, చక్కపల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పలు ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ అరుణ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తాళ్ళరేవులోని సూర్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మూర్తి నర్సింగ్ హోంలలో రికార్డులను పరిశీలించడంతోపాటు ఆయా విభాగాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు శ్యామల, ఎంఎల్‌హెచ్ పి.మీనాక్షి, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రిని తనిఖీచేస్తున్న ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ అరుణ

నేడు 'తాండవ' నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి - కోటనందూరు

తాండవ రిజర్వాయర్ ఆయకట్టుకు ఆదివారం సాగునీటిని విడుదల చేయనున్నట్లు రిజర్వాయర్ డిఇ పి.అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి విడుదల కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంఎల్‌ఎలు యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, తాండవ జలాశయ ఛైర్మన్ కరక సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ మేడపరెడ్డి జోగుబాబు పాల్గొంటారని ఆమె తెలిపారు.

క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - పెద్దాపురం

పాఠశాలల్లో క్రీడలు, క్రీడా సౌకర్యాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు అన్నారు. శనివారం స్థానిక పద్మనాభ కాలనీలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం రవీంద్ర మాట్లాడుతూ ఈ పాఠశాలలో క్రీడా సౌకర్యాల పెంపుదలకు పిఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం ద్వారా రూ.5 లక్షలు కేటాయించారన్నారు. ఈ నిధులతో ఈ కోర్టు నిర్మాణం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, డివైఇఒ ఇ.ప్రభాకరశర్మ, వార్డు కౌన్సిలర్ పెంటకోట సత్తిబాబు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గెడ్డం పెదకాపు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, జనసేన పట్టణ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.




బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న చినరాజప్ప

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ, కాకినాడ రూరల్

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు శనివారం అందజేశారు. 12 మంది లబ్ధిదారులకు సుమారు రూ.18.50 లక్షల చెక్ లను బాధిత కుటుంబాలకు ఎంఎల్‌ఎ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని సిఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను సంబంధిత బాధితులకు మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి అందజేశారు. వలసపాకలలోని వారి నివాసం వద్ద కరప మండలం వేలంగి, జి.భవరం, పెనుగుదురు, రూరల్ మండలంలోని రమణయ్యపేట, తిమ్మాపురం, వలసపాకల, గైగోలుపాడు, చీడిగ, ఇంద్రపాలెం, నగర పాలక సంస్థ పరిధిలోని 2, 50 వార్డులకు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న పిల్లి దంపతులు

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివాసీ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శంఖవరం మండలం పెదమల్లాపురంలో జరిగిన కార్యక్రమంలో పెదమల్లాపురం మండలాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఐటిడిఎ ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని ఆదివాసీలు కోరారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

శంఖవరం మండలంలోని పెదమల్లాపురంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయం ప్రకారం గంగాలమ్మ పండుగ వాతావరణంలో కోలాటం, నందులాట, నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మూడు మండలాలకు చెందిన గిరిజనులు పెద్దఎత్తున ఈ వేడుకలో పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం అల్లూరి సీతారామరాజు కూడలిలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జర్త ముసలయ్య అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ సబ్ ప్లాన్ ఏరియాలో 59 గిరిజన గ్రామాలలో 32000 మంది జనాభా ఉన్నారని అన్నారు. 10 గ్రామ పంచాయతీలు 5 మండలాల పరిధిలో ఉన్నాయని, గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పెదమల్లాపురం కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. 2024 ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ అదే హామీని ఇచ్చారని అన్నారు. పెదమల్లాపురం కేంద్రంగా మండల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలను ఐటిడిఎ నుంచి వేరు చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందని, గిరిజనులు అయినా వారికి ప్రత్యేక సౌకర్యాలు ఉండటం లేదన్నారు. రిజర్వేషన్ సైతం అమలు కావడం లేదని, షెడ్యూల్ ఏరియాలో ఉద్యోగ, ఉపాధిలో వాటా రావడం లేదని అన్నారు. ఈ సందర్భంగా మండల సాధన కోసం సమిష్టిగా పోరాటం సాగించాలని తీర్మాణించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ట్రైనీ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెంచుబాబు, బి.విప్లకుమార్, రేచుకట్ల సింహాచలం, దొంగబ్బాయి, జర్త శ్రీను, అప్పలకొండ, లక్ష్మణ్, నాగేశ్వరావు, రమేష్, లక్ష్మణ్, కుమార్ పాల్గొన్నారు. **రౌతులపూడి** స్థానిక గుమ్మరేగుల వెళ్లే రహదారి వద్ద ఉన్న విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో సమస్యలను ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గంటిమల్ల అప్పారావు, వంతు నాగరాజు, చెన్నాడు సత్తిబాబు, వంతు దాలియ దొర, తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలంలోని గోవిందపురం గ్రామంలో ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘం రాష్ట్ర కన్వీనర్ జక్కంపూడి రాజు పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ వడ్డీ వ్యాపార నియంత్రణ చట్టాన్ని ఆదివాసీలందరికీ వర్తింప చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఆదివాసీలకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగులపల్లి అచ్చారావు, మామిడి రాంబాబు, మరిడమ్మ, సంకురమ్మ, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** నగరంలోని చల్ల జగన్నాథశాస్త్రి ఫంక్షన్ హాల్‌లో గిరిజన ప్రజా సమాఖ్య, విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు డాక్టర్ ఎల్.మధుకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిపిఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్, జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ఆదివాసులకు ఇప్పటికీ ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేక ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో లక్షలాదిమంది ఆదివాసి బిడ్డలు ఉన్నప్పటికీ నేటికీ వారు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి, విద్య, ఉపాధి రంగాలను మెరుగుపరచడమే నిజమైన ఆదివాసుల దినోత్సవమన్నారు. ఈ కార్యక్రమంలో యువజన అధ్యక్షులు హనుమంతునాయక్, ఆదివాసి స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లంకెల మధుకుమార్, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఫౌండర్ డాక్టర్ మల్లి భాస్కర్, సబ్ ప్లాన్ విద్యార్థి గిరిజన నాయకుడు వరహాలు, జివిఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షులు కల్యాణ్, కార్యదర్శి సాయిప్రవీణ్ పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్




జగ్గంపేటలో జెండాను ఆవిష్కస్తున్న సంఘ నాయకులు



కాకినాడలో అభివాదం చేస్తున్న ఆదివాసీ సంఘీయులు

కార్టూన్ 'నిజం'



ఘనంగా రాఖీ పండుగ

జిల్లాలో రాఖీ పండుగను శనివారం అన్న, చెల్లెల్లు, అక్కా తమ్ముళ్లు ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నలు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించుకున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో వృక్షాబంధన్ కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మొక్కలు నాటి వాటికి రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు టి.తేజేశ్వర రావు, డి.అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు. **సామర్లకోట** అచ్చంపేటలోని ఎంఎల్‌ఎ చినరాజప్ప కార్యాలయంలో మహిళా సమాఖ్య సభ్యులు కలిసి రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సిహెచ్.జగదీశ్వరి, మండల సమాఖ్య అధ్యక్షురాలు మార్చగిరి నాంచారమ్మ, గెద్దాడ శాంతకుమారి, విఒఎలు పాల్గొన్నారు. అలాగే జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ దంపతులు చెట్టుకు రాఖీ కట్టి వినూత్నంగా వృక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. **కాకినాడ రూరల్** రూరల్ నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి తన నివాసంలో శనివారం టిడిపి కార్యకర్తలు, నాయకులకు రాఖీ కట్టి సోదరభావాన్ని పంచుకున్నారు. **యు.కొత్తపల్లి** రాఖీ పండుగ సందర్భంగా నియోజక వర్గంలోని మహిళలకు డిప్యూటీ సిఎం, స్థానిక ఎంఎల్‌ఎ పవన్ కల్యాణ్ పంపించిన చీరలను జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, సానా నాగు పంపిణీ చేశారు. తొలి విడతగా 1200 చీరలను పంపించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. మరికొన్ని రోజుల్లో మిగిలిన మహిళలందరికీ చీరలు అందివ్వడం జరుగుతుందన్నారు. **ప్రత్తిపాడు** మండలంలో అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్వీట్లు తినిపించుకున్నారు. **జగ్గంపేట** మండలంలోని ప్రతి ఇంటా రక్ష బంధన్ వేడుకలను నిర్వహించారు. అక్కలు, చెల్లెళ్ళు అన్న తమ్ముళ్లకు రాఖీలు కట్టి స్వీట్స్ తినిపించారు. **రౌతులపూడి** మండలంలోని పలు గ్రామాలలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు.



సామర్లకోటలో చినరాజప్పకు రాఖీ కడుతున్న మహిళలు



విద్యార్థులకు బిస్కెట్లు పంపినీ చేస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు బిస్కెట్లు, కేకుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆనంద నిలయం బాలికల వసతి గృహంలో విద్యార్థులకు బిస్కెట్లు, కేకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన కాపుగంటి మివాన్ జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు పద్మనాభుని చిన్నబాబు, రాజేశ్వరి దంపతుల ఆర్థిక సాయంతో వీటిని అందజేసినట్లు తెలిపారు. సామర్లకోట రహదారిలో నివసిస్తున్న వలస కూలీల పిల్లలకు బిస్కెట్లు, కేకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోడా చరణ్ పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు గ్రామంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన భూమిలోని ఆక్రమణలను తొలగిస్తామని తహశీల్దార్ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం దేవస్థానం అధకారులతో కలిసి ఆక్రమించి లేఅవుట్‌గా మార్చి విక్రయించేందుకు సిద్ధం చేసిన ప్రాంతాన్ని తహశీల్దార్ పరిశీలించారు. ఆక్రమణలకు గురియైన సర్వే నెంబర్ 176/1 ఉన్న 3.28 సెంట్లు భూమి ఉన్న ప్రదేశంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ పర్యటనలో దేవదాయ శాఖ అధికారులు వీరభద్రరావు, ఫణీంద్ర పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లపైకి వస్తే చర్యలు

ప్రజాశక్తి - గండేపల్లి

దమ్ము చక్రాలతో తారు రోడ్లుపై ట్రాక్టర్లను నడిపితే కేసులు తప్పవని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దమ్ము ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దమ్ము చక్రాలతో ట్రాక్టర్లతో తారు రోడ్లపై రాకపోకలు సాగించడం వల్ల లక్షలాది రూపాయలతో వేసిన రోడ్లు నాశనం అవుతున్నాయని అన్నారు. కావున దమ్ము ట్రాక్టర్లు యాజమానులు, డ్రైవర్లు రోడ్డు పైకి వచ్చేటపుడు దమ్ము చక్రాలు తొలగించి మామూలు టైర్ చక్రాలతో రోడ్డుపైకి రావాలని అన్నారు. ప్రజాధనంతో వేసిన రోడ్డును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపైనా ఉందన్నారు. ఎవరైనా ఆవిధంగా దమ్ము చక్రాలతో రోడ్లపైకి వస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు తెలియ చేయాలని సూచించారు. నిబంధనలను విస్మరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వర్షాల వల్ల గ్రామాల్లో కాలువలు, చెరువులు నీటితో నిండాయని, కాబట్టి వాటిలో ఈత కొట్టడం కోసం యువత దిగరాదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని కొత్త వజ్రకుటం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళు తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పామాయిల్ తోటలోకి దూసుకువెళ్లి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన డ్రైవర్ తుమ్మలగుంట శ్రీనివాసరావు (53) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం...గండేపల్లి గ్రామంలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఆ శిబిరంపై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద ఉన్న రూ.2,850 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్లు, కోడిపందాలు, బొమ్మ బొరుసు, గుండాటలు, ఎత్తులాట, కోతా బంతి లాంటి జూద క్రీడలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. జూదాలు జరుగుతున్నట్లు గ్రహిస్తే 100, 112, 9440796529, 94949 33233 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి-తాళ్లపూడి

పక్కిలంకలో పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో రూ.13,590 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల మండలంలోని చెందుర్తి జంక్షన్ వద్ద జరిగిన చోరీ కేసులో నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. శనివారం స్థానిక స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. గత నెల 28న రాజమహేంద్రవరంలోని భవాని సిల్వర్లో గుమస్తాగా పనిచేస్తున్న సమీర్ ప్రజాపత్ తన మోటార్ సైకిల్పై పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలులోని దుకాణాల నుంచి రాత్రి 8 గంటలకు బంగారం, వెండి, డబ్బులు తీసుకుని చెందుర్తి బయలుదేరాడు. మార్గం మధ్యలో నలుగురు వ్యక్తులు సమీర్ ప్రజాపత్ని బ్లేడ్తో బెదిరించి అతని వద్ద ఉన్న 51 గ్రాముల బంగారం, 12.5 కిలోల వెండి, రూ.60 వేలు నగదు దోచుకొనిపోయారు. దీంతో అతను స్థానిక పోలీసు స్టేషన్లో ఆ మేరకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నిందుతులను అరెస్టు చేసేందుకు సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రైం టీముతో పాటు, ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సిసి ఫుటేజ్, సెల్ టవర్ సిగ్నల్స్ ద్వారా దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో కొనుగోన్న సెల్ నెంబర్ రాజమహేంద్రవరం భవాని సిల్వర్లో పనిచేసే వ్యక్తిదిగా గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి విచారించగా అతని ద్వారా అదే షాపులో పనిచేసే వేరొక అతను వారి స్నేహితుల ద్వారా ఈ చోరీ చేశారన్నారు. దొంగిలించిన బంగారం, వెండి, నగదును నిందితులు సామర్లకోట జల్లూరు మధ్యలో గ్రామ శివారిన ఒక పాడుబడ్డ పాకలో ఉంచి శనివారం వాటిని పంచుకొనుచుండగా నిందితులు రౌతు గోవిందు, గనిరెడ్డి సాయిప్రసాద్, కోన సాయిబాబు, బొమ్మను విజయ్ఆనంద్, కుక్కల శివమణికంఠలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18.50 లక్షల విలువ చేసే బంగారం, వెండి, నగదును, రెండు మోటార్ సైకిల్స్ను, ఐదు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో గొల్ల ప్రోలు, పిఠాపురం, యు.కొత్తపల్లి ఎస్ఐలు ఎన్.రామ కృష్ణ, మణికుమార్, జాన్బాషా వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు కూలీలను కబళించిన ప్రమాదం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన ఇద్దరు దినసరి కూలీలు కొవ్వూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో శనివారం మృతి చెందారు. గ్రామానికి చెందిన దవులూరి సుబ్రహ్మణ్యం (44), లంకే ప్రసాద్(26) శనివారం తెల్లవారుఝామున కడియపులంకలో పూల కుండీల లోడ్ పనికి బైకుపై వెళుతుండగా విజ్జేశ్వరం-సీతంపేట సమీపంలో రంగా విగ్రహం దగ్గర వెనక నుంచి లారీ బలంగా బైకును ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. దవులూరు సుబ్రహ్మణ్యం గల్ఫ్ దేశంలో 10 ఏళ్లు ఉండి తండ్రి మృతి చెందడంతో ఇటీవల స్వదేశానికి వచ్చి డైలీ కూలి పని నిమిత్తం కడియపులంకలోకి వెళ్తూ మృత్యువాత పడ్డాడు. ఆయనకు భార్య కుమారుడు ఉన్నారు. ప్రసాద్కు వివాహం కాలేదు. వీర మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలిసిన వెంటనే మంత్రి కందుల దుర్గేష్ హుటాహుటిన కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఘటనపై వివరాలు ఆరా తీశారు. తక్షణ సాయంగా బాధిత కుటుంబాలకు చెరో రూ.10,000 వ్యక్తిగత ఆర్థిక సాయం అందించారు.

వృద్ధురాలి చెవి దుద్దుల అపహరణ

ప్రజాశక్తి- కొవ్వూరు

గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన వృద్ధురాలు ఊనగట్ల పుటాలమ్మ వాడపల్లిలో బంధువుల ఇంటికి వచ్చింది. తిరిగి చిట్యాల వెళుతుండగా ఒక కేటుగాడు ఆమెను బైకుపై దింపుతానని ఎక్కించుకున్నాడు. కొవ్వూరమ్మ తల్లి గుడి వద్దకు తీసుకుని వచ్చి ఆమెను దింపాడు. తాను బంగారం షాపునకు వెళ్లి అతడి తలికి బంగారు చెవి దిద్దులు కొనుక్కుని వస్తానని చెప్పి నమ్మించాడు. మళ్లీ వచ్చి మీ ఊరు తీసుకువెళ్తానని నమ్మబలికాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి మా అమ్మకు చెవి దిద్దులు కొనాలి, నీ చెవి దిద్దులు సైజు తీసుకువెళ్లాలని, ఒకసారి దిద్దులు ఇవ్వమని చెప్పి అడిగాడు. ఆ మాయగాడి మాటలు నమ్మి ఆమె చెవిదిద్దులు ఇచ్చింది. నువ్వు ఇక్కడే ఉండమ్మా నేను మళ్లీ వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమెను గమనించిన స్థానికులు విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టౌన్ పోలీసులు ఆమె వద్దకు వెళ్లి కేసు విచారణ చేపట్టారు.

అరకొర సంక్షేమం..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఆచరణలో తలకిందులవటంతో ఆశలపై నీళ్లు చల్లారనే అభిప్రాయం ప్రజలతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లోనూ వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఉచిత ఇసుక, మద్యం ధరల నియంత్రణపై భిన్నమైన పరిస్థితులు నెలకొన్న విషయం విధితమే. ఇప్పటికీ ఇసుక కొరత వేదిస్తోంది. మద్యం ధరలు తగ్గకపోవగా బెల్ట్ షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. ఎక్సైజ్ శాఖ కొరడా జులిపిస్తున్నా ఫలితం లేకపోయింది. గత నెలలో అమలు చేసిన తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ వంటి పథకాలు సైతం అర్హులైన వారికి సైతం అందలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టిసిలో ఉచిత ప్రయాణానికి రంగం సిద్ధమవుతోంది. అయితే ఈ ప్రయణా లకు నిబంధనల చత్రాలు అడ్డుగోడలుగా మారనున్నాయి. మరోవైపు ఉన్నత విద్యనభ్య సించే విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా ఉచిత గ్యాస్ పథకం సైతం మేడిపండు చందంగా మారింది. ఉజ్వల్కు 3 సిలిండర్లు కోత విధించినట్లు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చెప్పకనే చెప్పింది. కూటమి పాలకులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల కొరత

జిల్లాలోని రైతాంగాన్ని ఎరువుల కొరత వేధిస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగు తున్న నేపథ్యంలో ఎరువుల కొరత నెలకొంది. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువుల పంపిణీలో ఈ ఏడాది నుంచి కోత విధించిన విషయం విధితమే. ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై రైతులకు అరకొరగా అవగాహన కల్పించి అధికార యంత్రాంగం చేతులు దులుపు కుంది. సేంద్రియ విధానం దిగుబడులపై ప్రభావం చూపిస్తుందనే ఆందోళనతో రైతులు పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల కొరత వెంటాడుతోంది. గత రబీ సాగులో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నగదు రైతులకు జమ చేయక పోవటం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు కౌలు రైతులకు వర్తించకపోవటంతో పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగిలింది. మరోవైపు ఎరువుల కొరత నేపథ్యంలో అప్పు దొరికే పరిస్థితి లేదు. దీంతో పరపతి ఉన్న పెద్ద రైతులకు మినహా, చిన్న మధ్య తరగతి రైతులకు ఈ ఏడాది సాగు ఆరంభంలోనే బాలారిష్టాలు ఎదురయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. అధికార యంత్రాం గం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరంచి రైతులకు సేంద్రియ వ్యవసాయంపై పూర్తి అవగాహన కల్పించే వరకూ ఎరువులు యథాతథంగా సరఫరా చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

కూరగాయలు, నిత్యావసరాలు పైపైకి

ఓవైపు కూరగాయల ధరలు... మరో వైపు నిత్యావసర సరుకుల ధరలు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నా యి. కిలో టమోటా రూ.50కి చేరిన విషయం విధితమే. ప్రభుత్వం ఏ రకం కూరగాయలు తీసుకున్నా రూ.50లు పై మాటే..శ్రావణ మాసం నేపథ్యంలో కూరగాయల వినియోగం ఒక్కసారిగా పెరిగింది. మరోవైపు డిమాండ్కు తగ్గట్లుగా సరఫరా లేదు. దీంతో కొనుగోలు దారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. అల్లం కేజీ రూ.150కి చేరింది. మరోవైపు బియ్యం ధరలు ఇప్పటికే పెరిగి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బియ్యం ధరల పెంపునకు కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న జిఎస్టి కారణమని వ్యాపా రులు చెబుతున్నారు. ప్రజల ఆదాయాలకు పొంతన లేకుండా నిత్యావసర ఖర్చులు పెరగడం ఆందోళనకు గురి చేస్తోంది.

జ్వరం... కలవరం

జిల్లా ప్రజలను సీజనల్ జ్వరాలు చుట్టుముడుతున్నాయి. గడిచిన రెండు వారా లుగా వర్షాలు కురువటంతో పారిశుధ్య నిర్వ హణ అటకెక్కింది. గ్రామాల్లో పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో జ్వ ర పీడితుల సంఖ్య క్రమ క్రమంగా పెరగటం తో ప్రభుత్వ, ప్రైయివేట్ ఆస్పత్రులలో ఒపిల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు నేతి బీర చం దంగా మారాయి. బ్లడ్ టెస్టులు మొదలుకొని వివిధ రకాల పరీక్షలు, మందులు ప్రభుత్వ ఆస్పత్రులలో లభించడం లేదు. అత్యధిక మందిని జిల్లాలో ప్రధాన ఆస్పత్రులైన రాజమ హేంద్రవరం, కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు వెనకడుగు వేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులలో తమ గ్రామాల్లోనే ఆర్ఎంపిలు, ఇతర ప్రైయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - కరప

స్థానిక పిహెచ్సిలో శనివారం గర్భిణులకు కాకినాడ మౌర్య హాస్పిటల్ అధినేత డాక్టర్ పుల్ల ప్రసాద్ సహకారంతో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు మాట్లాడుతూ ప్రతినెల 9వ తేదీన పిఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం చేపడుతన్నామని అన్నారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరిన వెంటనే స్పందించిన మౌర్య హాస్పిటల్ యాజమాన్యంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ ఎన్.ఉజ్వల, పిహెచ్సి మెడికల్ అధికారి డాక్టర్ ఆప్రోజ్, నాయకులు నక్క వీరభద్రరావు, మంగ పరమేష్, పేపకాయల తణుకులరాజు పాల్గొన్నారు.

వల్లభునికి రూ.3.1 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3,10,502 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,79,360, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,02,032, కేశఖండన ద్వారా రూ.5,560, తులాభారం ద్వారా రూ.450, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.23,100 వచ్చినట్లు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

వల్లభస్వామిని దర్శించుకున్న సిఆర్డిఎ కమిషనర్

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామిని శనివారం సిఆర్డిఎ కమిషనర్ కె.కన్నబాబు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, శశికుమార్, రాగాల ఉమామహేశ్వరరావు, నల్ల బాబు పాల్గొన్నారు.

రామచంద్రరావు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వడ్లమూరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, పెద్దాపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలి రామచంద్రరావు కుటుంబ సభ్యులకు జనసేన జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు శనివారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. రామచంద్రరావు ఇటీవల కాలంలో మృతి చెందారు. తొలుత రామచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రరావు కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తమనార లక్ష్మణ్దివాకర్, గొల్లపల్లి భద్ర, గుమ్మల్ల వెంకటేష్, ఎర్రవరపు రాజు, పాలిసెట్టి రాజు, చెన్నం వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు సర్పంచ్కు మాతృవియోగం

ప్రజాశక్తి - కోటనందూరు

కోటనందూరు సర్పంచ్ గరిసింగు దొరబాబు మాతృమూర్తి గరిసింగు మరిడమ్మ(75) శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతికి ఎంపిపి లగుడు శ్రీనివాస్, వైసిపి నాయకులు కురందాసు రాము, చింతకాయల చిన్నబాబు, గొర్ల రామచంద్రరావు, జగటాల వీరబాబు, జగటాల కోట సత్తిబాబు, కొత్తపల్లి మాణిక్యాలరావు, బండి నానిబాబు, కృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ప్రజాశక్తి - జగ్గంపేట

రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి జి.శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం మండలంలోని వ్యవసాయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎరువులు, విత్తనాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 9,300 కాగా, ఈ ఏడాది సుమారు 2500 ఎకరాలు మాత్రమే సాగు అయిందన్నారు. ఆగస్టు నెలలో 10 రోజులు గడిచిపోతుందన్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడితే వరి పంటను ఎదజల్లే విధానంలో చేసేలా రైతులను సన్నద్ధం చేయాలన్నారు. వర్షాలు కురవకపోతే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలని, రాయితీపై ప్రభుత్వం అందించే విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఖరీఫ్ సాగు రైతులకు ఈ క్రాఫ్ నమోదు చేయాలన్నారు. ఈ సమీక్షలో మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం, మండలంలోని వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మద్యాంధ్రాప్రదేశ్గా మారుస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్గా సిఎం చంద్రబాబు మారుస్తున్నారని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి శనివారం ఒక ప్రకటనలో విమర్శంచారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతుందని అన్నారు. ఈ మద్యం వల్ల అనేక కుటుంబాలు నాశనం అవుతున్నాయని అన్నారు. విచ్చలవిడిగా మద్యం షాపులకు, బెల్టు షాపులకు అనుమతులు ఇవ్వడం వల్లే ఈ పరిస్థితికి కారణమన్నారు. స్వర్ణాంధ్ర సారధిగా చెప్పుకుంటున్న చంద్రబాబు రాష్ట్రాన్ని లిక్కర్ ఆంధ్రగా మార్చేసి ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటమాడుతున్నారని అన్నారు. మద్యం షాపుల్లో అర్ధరాత్రి దాటిన అమ్మకాలు కొనసాగుతున్నాయని విమర్శంచారు. ఆదాయం కోసం మద్యం అమ్మకాలపై టార్గెట్లు పెట్టడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

పట్టపగలే వీధిలైట్ల వెలుగులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-సామర్లకోట రహదారిలో ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్టు పరిసరాలలో శనివారం పట్టపగలే వీధి లైట్లు వెలుగుతున్నాయి. కొన్ని ప్రాంతా లలో రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగడం లేదు. ఈ వీధిలైట్ల నిర్వహణలో లోపాల కారణంగానే ఇలా జరుగుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణ పరిధిలో వీధిలైట్ల నిర్వ హణను పరిశీలించి లోపాలు గుర్తించి సరి చేయించాలని, వెలగని వీధిలైట్లు స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



వెలుగుతున్న వీధిలైట్లు

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని నియోజకవర్గ మైనార్టీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు సిఎంచంద్రబాబుకు లేఖ రాసారు. నాగేశ్వరరావు విలేకరులతో శనివారం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక్కటైన రామచంద్రపురం నియోజకవర్గంలో రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు ఉన్నాయని అన్నారు. కేవలం కాజులూరు మండలం మాత్రమే కలిపి మిగిలిన రెండు మండలాలు అనగా రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కలపకుండా గత ప్రభుత్వంలో జిల్లాలు విభజన భాగంలో. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే, కనీస మౌలికా సదుపాయాలు కల్పించకుండానే రామచంద్రపురం నియోజకవర్గాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కలిపారన్నారు. నియోజకవర్గం ప్రజలు జిల్లా కేంద్రం అయిన అమలాపురం వెళ్లాలంటే కోటిపల్లి రేవు నుంచి ముక్తేశ్వరం రేవు వరకు పంటి దాటి వెళ్ళవలసిన ప్రమాదకర పరిస్థితి నెలకొందన్నారు. తిరిగి ప్రయాణంలో సాయంత్రం ఆరు గంటల దాటితే పంటు తిరగదన్నారు. దీని వలన జిల్లా కేంద్రం అమలాపురం వెళ్లాలంటే కనీసం రెండు గంటలు నుండి మూడు గంటలు వరకు సమయం పడుతుందని తెలిపారు. ఈ కారణంగా నియోజకవర్గం ప్రజలు విన్నపాన్ని స్వీకరించి మా నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని ప్రజలు తరుపున కోరుచూ లేఖ రాసినట్లు విలేకరులకు తెలిపారు.

బాలబాలాజీ స్వామికి వెండి వస్తువుల బహూకరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి నిత్య కైంకర్యాల నిమిత్తమై లక్కవరం వాసులు ముదునూరి పాండురంగరాజు రాణి దంపతులు వారి కుటుంబ సభ్యులు శనివారం రూ.3.45 లక్షలు విలువైన మూడు కేజీలు వెండి బిందె, రెండు వెండి దీపం కుందెలు, వెండి పళ్ళెం సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్య నారాయణ రాజు తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. బాల బాలాజీ ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.3,53,720లు ఆదాయం సమకూరిందన్నారు ఇందులో నిత్యాన్నదాన ట్రస్ట్కు రూ.1,01,912లు ఆదాయం వచ్చిం దన్నారు ఐదువేల మంది యాత్రికులు స్వామివారిని దర్శనం చేసుకోగా 3వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు అన్నారు.

ట్రస్ట్ బోర్డ్ నియామకానికి ఉత్తర్వుల జారీ

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ శాఖ కమిషనర్ (విజయవాడ) నోటిఫికేషన్ జారీ చేశారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ విడుదల నుంచి 20 రోజులలోపు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాల కోసం కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలన్నారు

ఘనంగా మహేష్బాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

హీరో మహేష్ బాబు 50వ పుట్టినరోజు వేడుకలను ద్రాక్షారామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామంలో రోటరీక్లబ్ కాకినాడ, మహేష్బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, స్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి, క్రికెట్ కిట్లు, వీధి వ్యాపారులకు గొడుగులు, మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు వంటి కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. వ్యాక్సిన్లను మంత్రి సుభాష్, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ సురభి శారద, రోటరీ క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ తడాల బుజ్జి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రికీ హాస్పిటల్, రికీ ట్రినిటీ, ద్రాక్షారామం సొసైటీ అధ్యక్షులు ముప్పనపల్లి గణేష్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, తడాల వరప్రసాద్, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** స్థానిక అంబేద్కర్ కన్వెన్షన్ హాలునందు శనివారం హీరో మహేష్ బాబు 50వ పుట్టినరోజు వేడుకలు ప్రిన్స్ మహేష్ బాబు అభిమాన సంఘం అధ్యక్షుడు పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బుద్ధాల బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో మహేష్ బాబు అభిమానులు రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, వృద్ధులకు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమాన సంఘం వైస్ ప్రెసిడెంట్ జంగా కొండ, యల్లమిల్లి చంటి, కాశి లాజర్ మట్టపర్తి రమణ, రెడ్డి స్వామి, జనిపల్లి అశోక్ పాల్గొన్నారు.

అంగరలో చిన్నారులకు తులాభారం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం చిన్నారులకు తులాభారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల మొక్కు తీర్చుకునేందుకు ఆలయానికి వచ్చిన యాత్రికులకు ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిన్నారుల తల్లిదండ్రులు పటిక బెల్లంతో తులాభారం నిర్వహించగా ఆలయ అర్చకులు కె.బాల బాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు పండితులు చిన్నారులకు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు.



ప్లీడర్ల వీధిలో కురుస్తున్న వర్షం

పెద్దాపురంలో భారీ వర్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలో శనివారం కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయంగా మారిపోయాయి. డ్రెయిన్లో పూడికల వల్ల ప్రవహించక ఆగిపోయిన మురుగునీరు వర్షం నీటిలో కలిసి ప్రవహించటంతో కొన్ని వీధులలో మురుగునీరు, వర్షం నీరు కలిసి ప్రవహించింది. దీనివల్ల ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్ నుంచి దర్గా సెంటర్ వరకు ప్లీడర్ల వీధిలో మురుగునీరు, వర్షపు నీరు కలిసి ప్రవహించింది.

సార్వత్రిక విద్యాపీఠం పర్యవేక్షణలో ఓపెన్ ఇంటర్ కోర్సులు

ప్రజాశక్తి - రాజోలు

చదువు మధ్యలో నిలిపేసిన వారు తిరిగి కొనసాగించే వీలుగా.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో సార్వత్రిక విద్యాపీఠం పర్యవేక్షణలో ఇంటర్మీడియట్ కోర్సులు అభ్యసించడానికి అవకాశం కల్పిస్తోందని మలికిపురం కోఆర్డినేటర్ పిడికె.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విశ్వ విద్యాలయాలు, ప్రయివేటు సంస్థల్లో దూర విద్యావిధానంలో చదువుకోవడానికి వీలుందన్నారు. గతం నుంచి ఈ విధానం నడుస్తున్నప్పటికీ తాజాగా మళ్ళీ ఈ ప్రభుత్వం విద్యా వికాసం సాధికారిత పెంచాలనే ఉద్దేశంతో పది, ఇంటర్ చదవడానికి అవకాశం కల్పిస్తోందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు మలికిపురం ఎంపిఎన్, జెఎస్, ఆర్విఆర్, డిగ్రీ కళాశాల ద్వారా ప్రవేశం పొందొచ్చునని వివరించారు. మహిళలు, వృత్తి, వ్యాపార రంగాలపై ఆధారపడిన వారు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు, సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాలు చదువుకోవడానికి వెసులుబాటు ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 15 సంవత్సరాలు నిండిన వారందరూ ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరడానికి అవకాశం ఉందని చెప్పారు. అలాగే గతంలో ఇంటర్ పరీక్షలు తప్పిన వారు, సగంలో మానేసిన వారు కూడా చేరొచ్చునని వివరించారు. పాఠశాలలో పదో తరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ అనుత్తీర్ణులైనప్పటికీ వారు పాసైన రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే అవకాశం కల్పిస్తారన్నారు. వికలాంగులు, ట్రాన్స్ జెండర్లు, మాజీ సైనిక ఉద్యోగులకు అడ్మిషన్ ఫీజులో రాయితీ ఇస్తారని పేర్కొన్నారు. అభ్యాసకులు ప్రవేశం పొందే నాటి నుంచి ఐదేళ్ల వరకు 9 పర్యాయాలు పబ్లిక్ పరీక్షలకు హాజరు కావొచ్చునని చెప్పారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైతే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ధృవపత్రాలను డిజి లాకర్లో భద్రపరచడానికి కూడా అవకాశం కల్పిస్తారని వివరించారు. వివరాలకు 96186 47987 ఫోన్లో సంప్రదించవచ్చన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - నల్లజర్ల

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ వెంకటరాజు అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సూపర్ సిక్స్ పథకాల ద్వారా 150000 మంది లబ్ధి పొందుతున్నారు అన్నారు .పల్లె పండుగ ద్వారా రూ.70 కోట్ల పనులు నిర్మాణం చేపట్టామన్నారు అంతేకాకుండా మరో 100 కోట్లకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మ రాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గత నాలుగు సంవత్సరాలలో జరగని అభివద్ధి తమ ప్రభుత్వం ఏడాదిలో పూర్తి చేసిందని అన్నారు ముందుగా నల్లజర్ల శివారులో ఉన్న అక్షయ పాత్ర హోటల్ దగ్గర నుంచి చెక్ పోస్ట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పి మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపరాజు తదితరులు పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు గ్రామ శివారులో సారా బట్టీపై ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు తెలిపారు. పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో నిఘాను పెంచినట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో సిఐ విజయశంకర్, ఎస్ఐ వి.మౌనిక, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గోకవరం

తిరుమలయపాలెం గ్రామ శివారు జిడిమామిడి తోటలో సారా బట్టీలపై పోలీసులు దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న గండిబోయిన వీర మహేంద్రను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.